క్లుప్తంగా

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



తెనాలిఅర్బన్: బోసురోడ్డులోని అన్నదాన సుఖీభవ చలివేంద్రంలో ప్రముఖ బిల్డర్ జీవీ నారాయణ సహకారంతో బుధవారం మజ్జిగను పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ పంపిణీ ఏర్పాటు చేశామన్నారు. అనేక మంది దాతలు ముందుకు వస్తుండటంతో వారి సహకారంతో మజ్జిగను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తెనాలిలో పునఃప్రారంభమైన సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సెక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్రవారాలలో కూడా క్యాంప్ జరుగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

మాజీ కౌన్సిలర్ సాంబశివరావు సేవలు మరువరానివి



తెనాలిఅర్బన్: సూర్యదేవర సాంబశివరావు సేవలు మరువరానివని పట్టణ ప్రముఖులు వాసిరెడ్డి శ్రీనివాస్, గాలి రవికుమార్‌లు పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ సూర్యదేవర సాంబశివరావు 19వ వర్ధంతిని పురస్కరించుకుని బోసురోడ్డులోని ఆయన స్మారక స్థూపానికి బుధ వారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయన సతీమణి, మాజీ కౌన్సిలర్ సూర్యదేవర శశికళ, సూర్యదేవర బుల్లి అబ్బాయి, బాలా మాస్టార్, వెంకయ్య, ఎన్‌టీఆర్ జగన్, వాసిరెడ్డి సులోచన పాల్గొన్నారు.

నిరాశ్రయులకు బియ్యం, దుస్తులు వితరణ



తెనాలిటౌన్: ఫర్ ది లీస్ట్ ఆఫ్ దెమ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల గ్రామమైన కొలకలూరు కాల్వకట్టలపై నివశించే నిరుపేదలకు బుధవారం బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సినీ దర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ సంస్థ నిర్వాహకులు రావూరి అంజలి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ



దుగ్గిరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందించిన వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ షేక్ జబీన థైవాన్ స్ప్రేయర్లు, విత్తన గొర్రులు, సాగు యంత్రాలు, వ్యవసాయ పరికరాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన యంత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంపీఓ పి.శిరీష మాట్లాడుతూ మొదటి దశలో రూ. 22.44 లక్షల విలువైన పనిముట్లు అందజేశామని చెప్పారు. ఇంకా అవసరమైన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చైతన్య, ఈమని సర్పంచ్ హరిణి, చింతలపూడి సర్పంచ్ టి. రామకృష్ణ, కె.శ్రీఅనిత, వి.కృష్ణప్రసాద్, జి.వెంకట్రావు, వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, రమేష్, దివ్యశ్రీ పాల్గొన్నారు.

చకచకా సబ్‌జైలు నిర్మాణ పనులు

- మూడు వైపుల ప్రహరీ నిర్మాణం
- మోడల్ జైల్ నిర్మాణానికి జగనన్న ప్రభుత్వం శ్రీకారం



నిర్మాణ పనులు జరుగుతున్న బ్యారక్‌లోని కొంత భాగం

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలు నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. నిర్మాణ పనులు ప్రారంభమై బేస్‌మెంట్‌వరకు పనులు చేపట్టి నెలల పాటు పనులును కొన్ని సాంకేతిక కారణాల వల్ల అపేశారు. దేశంలోనే మోడల్ జైలు సముదాయాన్ని నిర్మిస్తామంటూ ఇక్కడి పురాతన సబ్‌జైలును పడగొట్టి, నిర్మాణ పనులు ప్రారంభించారు. తెనాలి సబ్ జైలు కీలమని తెలిసినా అధికారులు నిర్మాణ పనులను వేగవంతంగా చేయిస్తున్నారు. మూడు వైపుల ప్రహరీతో పాటు బ్యారక్‌లోని కొంత భాగం , కార్యాలయం శ్లాబు దశ పూర్తయ్యాయి.

మోడల్ జైలు నిర్మించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయం..

సబ్‌జైలు భవన పసముదాయం శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన భవనాన్ని నిర్మించాల ని అధికారులు నిర్ణయించారు. ఈ జైలును బ్రిటీష్ పాలకులు 1912లో నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న భవన సముదాయంలోనే ఇన్నాళ్లు ఖైదీలు ఉన్నారు. 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జైళ్ల సంస్కరణపై దష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 113 ఏళ్ల క్రితం నిర్మించిన తెనాలి సబ్‌జైలు స్థానంలో అధునాతన సౌకర్యాలతో కూడిన జైలును నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అప్పటి జైళ్ల శాఖ డీజీ అహసన్ రెజా తెనాలి జైలును 2022 సెప్టెంబరులో పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, నీటి సౌకర్యం సరిగ్గా లేదని ఖైదీలు ఆయన దృష్టికి తెచ్చారు. రూ. 2.50 కోట్ల బడ్జెట్‌తో అధునాతన భవనాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు.

రాష్ట్రంలోనే మోడల్ జైలుగా..

ప్రస్తుతం ఉన్న సబ్‌జైలుకు అవకాశం ఉన్న మేర అదనంగా కొంత స్థలాన్ని సమకూర్చి రాష్ట్రంలోనే మోడల్ జైలుగా తెనాలి సబ్‌జైలును నిర్మించాలని అధికారులు భావించారు. అందుకు తగ్గ స్థలం కేటాయించాల్సిందిగా అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తహసీల్దార్‌కు సూచించారు. రాష్ట్రంలోనే మోడల్ జైలుగా నిర్మించాలని 2022లో రూ. 2.50 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. 2023 సెప్టెంబరులో సబ్ జైలును మూసివేసి పనులు ప్రాంభించేందుకు రంగం సిద్ధం చేశారు. కొన్ని సాంకేతిక కారణాలు, అంచనా వ్యయం పెరగడంతో జైలును తిరిగి ప్రారంభించారు. అనంతరం రూ. 3.30 కోట్లతో అంచనాలను రీవైజ్ చేశారు. అన్ని అనుమతులు లభించడంతో 2023 నవంబరులో అప్పటి సీనియర్ ఐపీఎస్ అధికారి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, ఇన్‌చార్జి డీజీ (జైళ్ల శాఖ) హరీష్‌కుమార్ గుప్తా తెనాలి సబ్‌జైలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

గతంలో నిలచిపోయిన నిర్మాణం

శంకుస్థాపన చేసి ఇన్ని నెలలైనా కేవలం బేస్‌మెంట్ వరకు మాత్రమే నిర్మాణం పూర్తి చేశారు. ఏడు నెలలుగా పనులు ముందుకు సాగలేదు. జైలు ఇక్కడ లేకపోవడంతో సంబంధించిన సిబ్బంది ఎవరూ ఉండడం లేదు. తెనాలి సబ్‌జైలు ఖైదీలను గుంటూరు జిల్లా జైలుకు లేదా బాపట్ల, రేపల్లె సబ్ జైలుకు పంపాల్సి వస్తోంది. కోర్టు వ్యవహారాలు చూసే కానిస్టేబుళ్లకు ఈ వ్యవహారం పెద్ద



జైలు అధికారులు, సిబ్బంది కార్యాలయ నిర్మాణం జరుగుతున్న దృశ్యం

తలనొప్పిగా మారింది.

ప్రస్తుతం వేగంగా పనులు

మోడల్ సబ్‌జైలు నిర్మాణ పనులు ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయి. ఖైదీలను ఉంచే బ్యారక్‌లో కొంత భాగం, అధికారులు, సిబ్బంది కార్యాలయం శ్లాబు పూర్తయ్యాయి. మూడు వైపులా 20 అడుగుల మేర ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. భవన సముదాయ నిర్మాణం మొత్తం పూర్తయ్యాక ప్రహరీకి ప్లాస్టరింగ్ చేయడంతో పాటు విద్యుత్ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన మెరకను తోలిస్తున్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ఖాళీ స్థలంలోని వ్యర్థాలను వెంటనే తొలగించి.. అక్కడ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని డాంగేవారి వీధి, చెంచుపేట, అమరావతి ప్లాట్స్ లలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32వ వార్డులో ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే వారికి ఆహ్లాదాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ సునీల్, వైఎస్సార్ సీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తెనాలిరూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తెనాలి అగ్నిమాపక, విపత్తు స్పందన శాఖ అధికారులు సిబ్బంది పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మూడో రోజుకు చేరుకున్న వారోత్సవాల్లో భాగంగా అపార్ట్‌మెంట్‌లలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు జరుగకుండా పాటించాల్సిన జాగ్రత్త చర్యల గురించి చెంచుపేట రిలయన్స్ పెట్రోల్‌బంకు సమీపంలోని సింధుప్రియ అపార్ట్‌మెంట్‌లోని వారికి అవగాహన కల్పించారు. అలాగే సిలిండర్ల నుంచి మంటలు చెలరేగితే మంటలను అదుపుచేసే విధానాన్ని ప్రదర్శించారు. ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి కె. కోటిరెడ్డి నేతృత్వంలో అగ్నిమాపక బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.

మర్యాదపూర్వ కలయిక



ఉత్తేజ్‌రెడ్డిని సత్కరిస్తున్న నూరిఫాతిమా, తదితరులు



అంబటిని సత్కరిస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉత్తేజ్‌రెడ్డి

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును బుధవారం పార్టీ అనుబంధ విభాగాల నూతన అధ్యక్షుడిగా నియమితులైన పలువురు సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాలరావు అంబటిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను దుశ్శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా..

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమాను బుధవారం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఆమెను దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

పీడితవర్గాల ప్రతిఘటనకు రూపం 'ముట్టడి'

పుస్తకావిష్కరణ సభలో వక్తలు



ముట్టడి నాటకం పుస్తకాన్ని ఆవిష్కరించిన మోపిదేవి ఫణిరాందేవ్

తెనాలి: బలవంతుల ఉక్కుపాదం కింద నలుగుతూ చావుకీ బతుక్కీ ఊగిసలాడుతున్న పేదజనం ఉప్పెనలా తిరగబడితే పర్యవసానం ఎలా ఉంటుందనేది 'ముట్టడి' నాటకం అద్భుతంగా చిత్రీకరించిందని ఆ నాటక పుస్తకావిష్కరణలో వివిధ రంగాల ప్రముఖులు ప్రశంసించారు. పట్టణ చినరావూరుకు చెందిన పెరికల ప్రకాష్ 1986లో రచించిన ముట్టడి నాటకం గత మూడున్నర దశాబ్దాలుగా స్క్రిప్టు రూపంలోనే రాష్ట్రం మొత్తం వందకు పైగా ప్రదర్శనలకు నోచుకుంది. రచయిత ఇంటిపేరుగా 'ముట్టడి' చేరింది. ఇంత కాలానికి ఆ నాటకాన్ని పుస్తకరూపంలో తీసుకొచ్చారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటైన సభకు న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నేత మోపిదేవి ఫణిరాందేవ్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమాజ రుగ్మతలను ప్రతిబింబించే కళారూపానికి ప్రజాదరణ ఉంటుందన్న వాస్తవానికి ప్రతిరూపం ముట్టడి నాటకమని చెప్పారు. మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ, సామాజిక రుగ్మతలపై గురిపెట్టిన తుపాకీ 'ముట్టడి'గా చెబుతూ, ఇలాంటి నాటకం రావటం రంగస్థల ప్రయోగమేనని అన్నారు. 'ఇస్కఫ్' జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ కనపర్తి అబ్రహాం లింకన్, కనపర్తి బాబూరావు, చిట్టూరి సీతారామయ్య, ఎహేస్కేలు మాట్లాడారు. రచయిత ముట్టడి ప్రకాష్ నాటక రచన నేపథ్యం వివరించారు.

నందివెలుగులో వ్యక్తి అదృశ్యం

తెనాలిరూరల్: వ్యక్తి అదృశ్యంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం నందివెలుగు జాషువానగర్‌కు చెందిన కొత్తపల్లి రమేష్ కొంతకాలంగా మానిక రుగ్మతతో బాధపడుతూ చెన్నైలో చికిత్స పొందుతున్నాడు. తన అన్న దీనదయాళ్ వద్ద నందివెలుగులో ఉంటున్నాడు. ఈనెల 9న దీనదయాళ్ నిద్రిస్తున్న సమయంలో రమేష్ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో అతను పోలీసులను ఆశ్రయించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, రమేష్ ఇంటి నుంచి బయటకు వెళుతున్న సమయంలో తెలుపు చొక్కా, నలుపు ప్యాంటు ధరించి ఉన్నాడని, గుర్తించిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్ఐ ఆనంద్ కోరారు.

29 మందికి జరిమానా

విజయవాడలీగల్: మద్యం సేవించి వాహనాలు నడిపిన 29 మందికి 8వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు జరిమానా విధించారు. నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలో 5వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిలో 11మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, 18 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి.. పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని, వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు.

దేశంలో పెరుగుతున్న అంటరానితనం, అసమానతలు

తాడేపల్లి రూరల్: దేశంలో అంటరానితనం, అసమానతలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని విప్లవ రచయిత సంఘం (విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కన్వీనర్ కిరణ్ తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని యానాదుల కాలనీలో బుధవారం పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యానాదులు ఉద్యమాలు నడిపారని తెలిపారు. వారి తాకిడిని తట్టుకోలేని బ్రిటిష్ ప్రభుత్వం పోరాట యోధులైన ఊటుకూరు కోటయ్య, నిమ్మల శేషయ్య, ఎర్ర సుబ్బయ్య, కత్తి చెల్లెమ్మ, వేణుబాక రామయ్య తదితరులపై దాడి చేసి జైళ్లలో బంధించిందని చెప్పారు. పురాతత్వ పరిశోధనల ప్రకారం తెలుగు భాష ప్రాచీనత 2400 సంవత్సరాల నాటిదని తెలిపారు. ఈ భాషని, యానాదులే మాట్లాడేవారని, తీసుకువచ్చింది వారేనని పరిశోధనలు చెబుతున్నాయని వివరించారు. పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు షేక్ నాగూర్ వలి, శ్రీధర్‌లు మాట్లాడుతూ నేడు ముస్లింలు, క్రిస్టియన్లపై దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో సంఘటనలు దేశ ప్రజలంతా చూశారన్నారు. పౌరహక్కుల సంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి గోపీనాథ్ మాట్లాడుతూ ఇటీవల మంగళగిరిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఛత్రపతి శివాజీ పుట్టిన రోజు సందర్భంగా ఊరేగింపుగా ర్యాలీ చేశారని గుర్తు చేశారు.

పర్యావరణ హిత ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి అవసరం

అన్నా యూనివర్సిటీ డీన్ ఆర్. జయవేల్



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఐసీఈఈఎస్–2025 పేరుతో 'ఎమర్జింగ్ ఎలక్ట్రానిక్ సస్టెన్‌బిలిటీ' అంతర్జాతీయ సదస్సును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడులోని చెన్నైకు చెందిన అన్నా యూనివర్సిటీ డీన్ ఆర్. జయవేల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో మెటీరియల్స్ వినియోగం ద్వారా పర్యావరణ హితం కలిగించే ఎలక్ట్రానిక్స్ తయారీపై దృష్టి సారించాలని తెలిపారు.

రిజిస్ట్రార్ కె. సుబ్బారావు మాట్లాడుతూ సదస్సుకు అడ్వాన్స్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందించినట్లు పేర్కొన్నారు. దేశ విదేశాల నుంచి 400కు పైగా పరిశోధన పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా చెన్నైకు చెందిన ఎంఈటీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వి.రాజేంద్రన్ పర్యావరణ మార్పులకు అనుగుణంగా తట్టుకునే ఎలక్ట్రానిక్ వ్యవస్థల అవసరాన్ని వివరించారు. సదస్సులో వడోరాకు చెందిన జీఎస్ఎఫ్‌సీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి.ఆర్. సిన్హా, ఐఆర్‌డీ విభాగాధిపతి వి. విశ్వనాథ్ షెనాయ్, కేఎల్‌యూ వీసీ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీలు ఏవీఎస్ ప్రసాద్, కె. రాజశేఖరరావు, ఎస్. వెంకట్రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి కేఆర్ఎస్ ప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి ఎం. సుమన్, ఐఆర్‌డీ అసోసియేట్ ప్రొఫెసర్ వి. వివేకానందన్, ఈఎల్‌జీఈ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్. అరుణ్ మేధా, ఎన్ఐటీ, ఐఐటీలతో పాటు జాతీయ విద్యాసంస్థలు, ఇతర దేశాల నుంచి పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం సీఐగా శివరామకృష్ణ బాధ్యతల స్వీకరణ



ఫిరంగిపురం: స్థానిక పోలీసు స్టేషన్ సీఐగా కె.శివరామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐడీ డిపార్టుమెంటులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి సారించి అరికడతానని చెప్పారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన రవీంద్రబాబు వీఆర్‌కు వెళ్లారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రజక సంఘం నాయకులు

తాడేపల్లి రూరల్: కొండపల్లిలో ఈనెల 20,21వ తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని తాడేపల్లి నగర కమిటీ అధ్యక్షులు ఉండవల్లి పార్థసారథి పిలుపునిచ్చారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో బుధవారం రాష్ట్ర మహాసభల కరపత్రాల పంపిణీలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రజకులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. అపార్ట్‌మెంట్ల వద్ద చిన్న చిన్న సమస్యలపై దాడులు, దౌర్జన్యాలతో పాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారని పేర్కొన్నారు. రజక వాచ్‌మెన్, ఇస్త్రీదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20,21వ తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. మహాసభల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వల్లభాపురం మస్తాన్‌రావు, మునిపల్లి సాంబశివరావు, తాడేపల్లి శ్రీనివాసరావు, ధనుంజయరావు, శివపార్వతి, చంచమ్మ, జ్యోతి, రవణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

న్యాయస్థానాల తీర్పులను అమలు చేయాలి



శిబిరంలో కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని బుధవారం నాయకులు కూరపాటి స్టీవెన్, టి. నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఈ ప్రాంతంలో పర్యటించినపుడు కార్మికులు తమ సమస్యను విన్నవించుకున్నారన్నారని తెలిపారు. స్పందించిన ఆయన తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ఎం. గురవయ్య, సాంబశివరావు, హగ్గయ్య, ఇమాంబి, శివకుమారి, దుర్గా భవాని, సారమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

దుగ్గిరాల: మండలంలోని గొడవర్రులో బుధవారం ఆది రేణుకమ్మ తల్లి, పోతురాజు స్వామి నూతన విగ్రహాల ప్రతిష్ట కన్నుల పండువగా జరిగింది. ఉదయం 8.22 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఎన్.గోపాలకృష్ణ, కె.రామారావు, పి.ప్రసాద్, ధనరాజు, శ్రీనివాసరావు, పోతురాజు, శ్రీహరి, హర్షవర్ధన్, మల్లికార్జున, ఆదిశేషు పాల్గొన్నారు.

పీఎండీఎస్ కిట్లపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడులో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పీఎండీఎస్ (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్)లో భాగంగా 30 రకాల పప్పు దినుసులు, నూనె, తీగ సంబంధిత విత్తనాలతో 65 కిట్లను తయారు చేశారు. దీనిపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. రుతు పవనాలు రాకముందే ప్రతి రైతూ సారవంతంగా ఉండేందుకుగాను ఎకరా పొలంలో పీఎండీఎస్ 12 కిలోల కిట్‌ను చల్లుకోవాలని సూచించారు. నలభై రోజులకు ఎదుగుదల ఉంటుందని తెలిపారు. తరువాత పొలంలోనే కలియదున్నుకోవాలని, దీని ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి ఇచ్చేందుకు దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎస్ఎఫ్ఏ ఉమాదేవి, ఎంటీ వరప్రసాద్, మోడల్ మేకర్ ఇర్ల వెంకటేశ్వర్లు, అన్నామణి, ఇంచార్జి రామకృష్ణ, అమల, రైతులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు సహకరించాలి



దుగ్గిరాల: భూముల రీ సర్వేకు రైతులు, గ్రామస్తులు సహకరించాలని డెప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ కోరారు. భూముల రీ సర్వేపై దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. డెప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ మాట్లాడుతూ దుగ్గిరాలలో మూడు టీంలు సర్వే చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాన్ని ఆరు బ్లాకులుగా విభజించినట్లు తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు నిర్ణయిస్తామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ భూములు, మిగతా భూములను కొలుస్తామని వివరించారు. రీ సర్వే ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపాలరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త రాధకు అవార్డు



రాధను అభినందిస్తున్న వైద్యులు ఫరీనాబేగం, యానీగ్రేస్, సిబ్బంది

ఫిరంగిపురం: మండలంలోని సుదురుపాడుకు చెందిన పొనుగుపాటి రాధకు ఉత్తమ ఆశా కార్యకర్త అవార్డు వచ్చినట్లు పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీనా బేగం బుధవారం తెలిపారు. వైద్యశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా స్థాయిలో ఉత్తమ కిల్కారీ సేవలు మెరుగ్గా అందించినందుకు అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్త రాధను వైద్యులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ యానీ గ్రేస్, సీహెచ్‌వో వెంకటలక్ష్మి, కె.సుదర్శన్ రాజు పాల్గొన్నారు.